
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
జగిత్యాల
జిల్లా వార్తలు
5★★
శనివారం 26 ఏప్రిల్ 2025



అర్హులకే ఇళ్లు



- ఇంటింటి సర్వే ప్రారంభించిన అధికారులు
- ఒక్కో అధికారికి 200 ఇళ్లు కేటాయింపు
- పక్కాగా నిబంధనల అమలు
- అత్యంత నిరుపేదలకు తొలి ప్రాధాన్యం
- నెలాఖరు వరకు పూర్తి కానున్న సర్వే

జగిత్యాల, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. లబ్ధిదారుల ఎంపికకు చేపట్టిన సర్వేను వేగవంతం చేసింది. అయితే ప్రభుత్వం ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇళ్లు కేటాయించగా ఇందులో 20 గ్రామాలను ఎంపిక చేసి 724 ఇళ్లను ఇప్పటికే మంజూరు చేసింది. గ్రామాల్లో మిగతా ఇళ్లకు లబ్ధిదారుల ఎంపికను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుని ఈ నెల 22 నుంచి గెజిటెడ్ అధికారులతో మున్సిపాలిటీలు, గ్రామాల వారీగా దరఖాస్తుదారుల ఇళ్లలో విచారణ (సర్వే) ప్రారంభించింది. ఈ సర్వే ఈ నెల 30వ తేదీ వరకు కొనసాగనుంది. ఇప్పటికే మున్సిపాలిటీలు, గ్రామాల్లోని ఇందిరమ్మ కమిటీలు లబ్ధిదారుల జాబితాలను జిల్లా కలెక్టర్‌కు అందజేయగా అత్యంత నిరుపేదలకు ముందుగా ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని నిర్ణయించారు. జిల్లాలోని జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, రాయికల్, ధర్మపురి మున్సిపాలిటీలతో పాటు అన్ని గ్రామ పంచాయతీల్లో గెజిటెడ్ అధికారులు ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారుల ఎంపిక కొరకు చురుకుగా సర్వే నిర్వహిస్తున్నారు.

ఒక్కో గ్రామానికి ఐదుగురు అధికారులు..

ఒక్కో గెజిటెడ్ అధికారికి 200ఇళ్ల విచారణ బాధ్యతలు అప్ప గించారు. ఎల్-1, ఎల్-2, ఎల్-3 జాబితాల ఆధారంగా ఒక్కోగ్రామానికి నలుగురు నుంచి ఐదుగురు అధికారులను నియమించారు. ఇందులో ఎంపీడీఓలు, ఎంపీఓలు, పీఆర్‌జేఈలు, ఏఓలు, మున్సిపల్ అధికారులు ఉన్నారు. వీరిలో ఒక్కొక్కరు 200 ఇళ్ల పరిశీలన చేస్తున్నారు. గుడిసెలు, ఇంటిపై టార్పాలిన్ కవర్లు కప్పుకున్న వారు, పెంకుటిల్లు ఉన్నవారు, కిరాయికి ఉన్న వారికి మొదటి ప్రాధాన్యం ఇస్తున్నారు. అనంతరం అర్హుల జాబితాలను పంచాయతీ, మున్సిపాలిటీల నోటీస్ బోర్డుల్లో అతికిస్తారు. తర్వాత జిల్లా కలెక్టర్‌కు అందజేస్తారు.



కొడిమ్యాలలో ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారుల సర్వే నిర్వహిస్తున్న అధికారులు

నిబంధనలు ఇలా...

ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రస్తుతం లబ్ధిదారు ఉంటున్న ఇంటిపై కప్పు, గోడల రకం, కచ్చా లేదా పక్కా నిర్మాణమా చూపాల్సి ఉంటుంది. లబ్ధిదారు ఉంటున్న ఇల్లు అద్దె లేదా సొంతమా, ఇంటి నిర్మాణ స్థలం ఉంటే దానిరకం (పట్టా, రిజిస్టర్ డాక్యుమెంట్లు, పట్టాదారు పాస్ పుస్తకం, స్థలం పంచుకుంటే దానికి సంబంధించిన రుజువులు)ఉండాలి. ఇంటి స్థలం 60 గజాల కంటే ఎక్కువ ఉందా, గ్రామీణ ప్రాంతాల్లో నెలకు రూ. 15 వేలు, మున్సిపాలిటీల్లో నెలకు రూ. 25 వేల కంటే తక్కువగా ఆదాయం ఉండాలి. లబ్ధిదారు గ్రామంలో కుటుంబంతో కలిసి నివసిస్తూ ఉండాలి. మున్సిపాలిటీలో అయిదేళ్లకు మించి నివాసముండాలి. 400 నుంచి 600 చదరపు అడుగుల్లో ...


మిగతా 8లో

మే మొదటి వారంలో లబ్ధిదారుల జాబితా

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మే మొదటి వారంలో ఇళ్లు మంజూరు కానున్నట్లు తెలుస్తోంది. ఈ దిశగా అధికారులు చర్యలు ప్రారంభించారు, ఇందిరమ్మ కమి టీలు ఇచ్చిన జాబితాల ఆదారంగా లబ్ధిదారులను ఎంపిక చేస్తున్నారు. అధికారులు సర్వే ఆధారంగా ఇచ్చిన జాబితాలను కలెక్టర్ జిల్లా ఇన్‌చార్జి మంత్రికి సమర్పించి ఆయన నుంచి మంజూరు తీసుకుంటారు. అనంతరం ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభిస్తారు.

మండుతున్న ఎండలు

- జిల్లాలో 45.3 డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రత నమోదు



జగిత్యాల అర్బన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లాలో ఎండలు మండిపోతున్నాయి. రోజు రోజుకు ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. జనం తీవ్రమైన ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. మధ్యాహ్నం రోడ్లపైకి రావాలంటేనే భయపడుతున్నారు. శుకవ్రారం జిల్లాలోని రాయికల్ మండలం అల్లీపూర్‌లో 45.3 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు కాగా రాయికల్‌లో 45.2, మల్లాపూర్‌లో 45.1, కోరుట్లలో 45.0 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి. గొల్లపెల్లి, బీమారం మండలం మన్నె గూడెంలో 44.8, ధర్మపురి మండలం జైనా, కోరుట్ల మండలం అయిలా పూర్‌లో 44.7, మెట్‌పెల్లిలో 44.6, ధర్మపురి మండలం నేరెల్ల, మెడిపెల్లి, పెగడపెల్లిలో 44.5, ఇబ్రహీంపట్నం మండలం గోదూర్‌లో 44.4, సారంగపూర్, వెల్గటూర్, కథలాపూర్ 44.3, బుగ్గారం మండలం సిరికొండలో 43.8, బీర్పూర్ మండలం కొల్వాయిలో 43.7,ఎండపెల్లి మండలం మారెడుపల్లిలో 43.6, జగిత్యాల మండలం పొలసాలో 43.2, జగిత్యాల, మల్యాలలో 43.1, ధర్మపురి మండలం బుద్దేశ్ పల్లి, ఎండపెపల్లి మండలం గుల్లపేట, మల్లాపూర్ మండలం రాఘ వపేటలో 42.9, మల్యాల మండలం మద్దుట్లలో 42.5, మెట్‌పెల్లి మండలం జగ్గాసాగర్‌లో 42.5, కొడిమ్యాల మండలం పూడూర్‌లో 42.0, బీమారం మండలం గోవిందారంలో 41.9, కొడిమ్యాల మండలం తిర్మలాపూర్‌లో 41.3 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి,

హమాలీల సంఖ్య పెంచాలి

- తహసీల్దార్ రమేష్

కొడిమ్యాల, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి) : కొనుగోలు కేంద్రాలలో హమాలీల సంఖ్యను పెంచాలని తహసీల్దార్ జి. రమేష్ కొనుగోలు కమిటీలను ఆదేశించారు. శుక్రవారం మండలంలోని డబ్బుతిమ్మయ్యపల్లి, నల్లగొండ గ్రామాల్లో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. కొనుగోలు నిర్వహణ రికార్డులను పరిశీలించారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ ధాన్యం మ్యాచర్ వచ్చిన వెంటనే తూకం వేసి మిల్లులకు తరలించాలన్నారు. ప్రస్తుత్తం ఉన్న రెండు బ్యాచ్‌లకు అదనంగా రెండు బ్యాచ్‌లు హమాలీలను పెంచాలన్నారు. తహసీల్దార్ వెంట ఆర్ఐ. కరుణాకర్, పలువురు రైతులు ఉన్నారు.

అంగన్‌వాడీ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

- ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్



చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న విప్ లక్ష్మణ్‌కుమార్

జగిత్యాల, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లోని ప్రీస్కూల్ పిల్లల్లో చురుకుదనం ఎక్కువగా ఉంటుందని, అంగన్‌వాడీ సేవలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని ధర్మపురి ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం జగిత్యాల జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పోషణపక్షం, పోషణ జాతర, గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ మాట్లాడుతూ జిల్లాలోని చాలా వరకు అంగన్‌వాడీ కేంద్రాలు అద్దె భవనాల్లో ఉన్నాయని, రాష్ట్ర ప్రభుత్వం కొత్త భవనాలు నిర్మించేందుకు చర్యలు చేపట్టిందని అన్నారు. అడిషనల్ కలెక్టర్ బీఎస్ లత, జిల్లా సంక్షేమాధికారి బొనగిరి నరేష్, సిడిపిఓలు వీరలక్ష్మి, వాణిశ్రీ, మణెమ్మ, మమత హబ్ కో- ఆర్డినేటర్ అశ్విని పాల్గొన్నారు.

బసవేశ్వర జయంతి కమిటీ సభ్యుడిగా జగదీశ్వర్



జగిత్యాల అర్బన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 30వ తేదీన నిర్వహించనున్న మహాత్మ బసవేశ్వర జయంతి ఉత్సవ కమిటీ సభ్యుడిగా జగిత్యాల పట్టణానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు గుంటి జగదీశ్వర్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. జహీరాబాద్ ఎంపి సురేష్ షెట్కర్ చైర్మన్‌గా 22 మందితో ఉత్సవ కమిటీ వేసింది. ఈ కమిటీ ఈ నెల 30వ తేదీన హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో, రాష్ట్రంలోని అన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయాలో మహాత్మ బసవే శ్వర జయంతి నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తుంది.

లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా చేపట్టాలి

కథలాపూర్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలని వేములవాడ నియోజకవర్గ ప్రత్యేకాధికారి, రాజన్నసిరిసిల్ల జడ్పీ సీఈఓ వినోద్ సూచించారు. మండలంలోని భూషణరావుపేటలో ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో పాల్గొన్నారు. పలు కుటుంబాల వివరాలను సేకరించి మొదటి ప్రాధాన్యంలో ఎంపికకు సంబంధించి పలు అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ శంకర్‌నాయక్, పంచాయతీ కార్యదర్శి గఫూర్, కాంగ్రెస్ నాయకులు గడ్డం స్వామిరెడ్డి, తలారి మోహన్ తదితరులు ఉన్నారు.

నేడు విద్యుత్ సరాఫరా నిలిపివేత

జగిత్యాలరూరల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల రూరల్ మండలం లక్ష్మీపూర్ సబ్‌స్టేషన్‌లో విస్తరణ పనులు ఉన్నందున శనివారం విద్యుత్ సరాఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ సుందర్ తెలిపారు. లక్ష్మీపూర్ సబ్‌స్టేషన్ పరిధిలోని లక్ష్మీపూర్, జాబితాపూర్, ధర్మారం, తిమ్మాపూర్ గ్రామాల్లో ఉదయం 7 గంటలనుంచి 10 గంటలవరకు సరఫరా ఉండదన్నారు.

నూతన చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

- జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్

కోరుట్ల, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశ పెట్టిన భూ భారతి, ఆరోఓఆర్ చట్టాలపై రెవెన్యూ అధికారులు ప్రజలు అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని అష్టలక్ష్మి దేవాలయంలో ఏర్పాటు చేసిన నూతన చట్టాలపై అవగాహన సదస్సులో జిల్లా కలెక్టర్ పాల్గొన్ని అధికారులకు పలు సూచనలు సలహాలను అందిచారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ మాట్లాడారు. భూ భారతి చట్టంతో రైతులకు మేలు జరుగుతుందని పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారం జరుగుతాయిని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డీఓ జీవాకర్ రెడ్డి, మున్సిపల్ కమీషనర్ మారుతి ప్రసాద్, ఇంచార్జ తహసిల్దార్ షారూక్, ఎంపీడీఓ రామకృష్ణ, మండల వ్యవసాయ అధికారిణి నాగమణి, అధికారులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

కోరుట్ల రూరల్ : ధాన్యం కొనుగోలు పక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం మండలంలోని అయిలాపూర్ గ్రామంలో సింగిల్ విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంను జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ పరిశీలించారు. కేంద్రంలో నిలువ ఉన్న దాన్యం నిలువల వివరాలను తూకం అయిన రికార్డులను పరిశీలించారు. నాణ్యత ప్రమాణాలకు లోబడి ధాన్యం కొనుగోలు చేసి రైస్ మిల్లుకు తరలించాలని అన్నారు. రైతులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డీఓ జీవకర్‌రెడ్డి, ఇన్‌చార్జి తహసీల్దార్ ఫారూర్ ఎంపీడీఓ రామకృష్ణ, మండలవ్యవసాయ అధికారిణి నాగమణి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

భూభారతి చట్టంతో ప్రతి ఒక్కరికీ న్యాయం

- ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్

బీర్‌పూర్ : భూభారతి చట్టంతో ప్రతి ఒక్కరికీ న్యాయం జరుగుతుందని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. శుక్రవారం బీర్‌పూర్ మండలంలోని రైతు వేదికలో నూతన ఆర్‌వోఆర్ చట్టం 2025 భూ భారతి చట్టంపై అవగాహన సదస్సులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజయ్ కుమార్ మాట్లాడుతూ గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన ధరణితో రైతులు, భూయజమానులకు తీవ్ర నష్టం జరిగిందని అలాంటి ఇబ్బందులు రైతులకు కలుగకూడదని కాంగ్రెస్ ప్రభుత్వం భూభారతి చట్టం తీసుకు వచ్చిందని అన్నారు. దీనితో భూసమస్యలు పరిష్కారం అవుతాయని పేర్కొన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ నూతనంగా వచ్చిన ఆర్‌వోఆర్ చట్టం 2025 భూ భారతిపై రైతులకు, ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించారు. మండలానికి చెందిన 20 మంది లబ్దిదారులకు సీఎం సహాయనిధి ద్వారా మంజూరైన 5లక్షల రూపాయల విలువ గల చెక్కులను, ఏడుగురు ఆడబిడ్డలకు కళ్యాణ లక్ష్మి పథకం ద్వారా మంజూరైన ఏడు లక్షల రూపాయల విలువ గల చెక్కులను లబ్ధిదారులకు ఎమ్మెల్యే, కలెక్టర్ చేతుల మీదుగా అందించారు. ఆర్‌డీవో మధుసూదన్, కెడీసీసీ జిల్లా మెంబర్ ముప్పాల రాంచందర్‌రావ్, కొల్వాయి సింగిలివిండో చైర్మన్ నవీన్‌రావ్, తహసీల్దార్ ముంతాజుబ్దిన్, ఎంపీడీవో లచ్చాలు, ఆర్‌ఐలు శ్రీనివాస్, రాహుల్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ విజయోత్సవ సభకు సర్వం సిద్ధం

- పార్టీ జిల్లా అధ్యక్షులు విద్యాసాగర్‌రావు

జగిత్యాల, ఏప్రిల్ 25 (ఆంధ్ర జ్యోతి): బిఆర్ఎస్ స్థాపించి 25 సంవత్సరాలు అయిన సందర్భంగా వరంగల్ సమీపంలో ఎల్కతుర్తిలో భారీ ఎత్తున్న చేపడుతున్న బిఆర్ఎస్ రజతోత్సవ వేడుకలకు జగిత్యాల జిల్లా సన్నద్ధం అయిందని, కెసిఆర్‌ను చూచేందుకు జనం ఉవ్విళ్ళూరుతున్నారని బిఆర్ఎస్ జగిత్యాల జిల్లా అధ్యక్షులు విద్యాసాగర్‌రావు అన్నారు. శుక్రవారం జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ దావ వసంతతో కలిసి జిల్లా పార్టీ కార్యాలయంలో విలేఖరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలలో ఆయన మాట్లాడుతూ వరంగల్ అన్ని ఏర్పాట్లు పూర్తి అయినాయని, పార్టీ శ్రేణులతో పాటు కెసిఆర్‌ను చూసేందుకు ఉత్సహం చూపుతున్నారని, వరంగల్ సబకు జిల్లా నుంచి 20వేల మంది తరలి వెలుతున్నామని అన్నారు. 15 నెలల దుర్మరగపు పాలన ప్రపంచంలో ఏ రాష్ట్రంలోను లేదని, ఏ ఒక్క మంత్రి కూడా తన పదవికి న్యాయం చేయలేయడంలేదని విమర్శించారు. పోలీసుల పాత్ర నిమిత్ర మాత్రమైందని ప్రజలు, రైతులు ప్రభుత్వంపై విసిగిపోపోయారని అన్నారు. దావ వసంత మాట్లాడుతూ బిఆర్ఎస్ 25 వసంతాలు పూర్తిచేసుకుని 27 నాడు రజతోత్సవ సభ కోసం ప్రజలు ఇంటి పార్టీగా గుండెల్లో నింపుకున్న ప్రజలు బిఆర్ఎస్ సభకు రావడానికి ఉత్సహం చూపుతున్నారని అన్నారు. ఎమ్మెల్సీ రమణ మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో జిల్లాలోని బీఆర్ఎస్ కార్యకర్తలు అధిక సంఖ్యలో రజతోత్సవ సభకు తరలి రావాలని పిలుపునిచ్చారు.



మాట్లాడుతున్న విద్యాసాగర్ రావు

ఉపాధి హామీలో అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవు

- డీఆర్‌డీఓ రఘువరన్
- పెగడపల్లిలో సామాజిక తనిఖీ ప్రజావేదిక

పెగడపల్లి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : ఉపాదిహామీ పథకం పనుల్లో అవకతవకలకు పాల్పడితే ఎంతటి వారైనా చర్యలు తప్పవని జిల్లా గ్రామీణాబివృద్ధి అధికారి రఘువరన్ పేర్కొన్నారు. పెగడపల్లి మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం ఉపాదిహామీ సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. మండలంలోని 23 గ్రామాలలో 1 ఏప్రిల్ 2024 నుండి 31 మార్చి 2025 వరకు ఉపాదిహామీ పథకం ద్వారా వ్యయం చేసి చేపట్టి రూ. 9 కోట్ల 5 లక్షల 96 వేల 265 లకు సంబందిచిన పనుల వారిగా ప్రజావేదికలో సామాజిక తనిఖీ బృందం చేపట్టిన తనిఖీలో వెల్లడైన అవకతవకలను తనిఖీ బృందం చదివి వినిపించగా అధికారులు అవకతవకలలో దుర్వినియోగమైన సొమ్ము రూ. 63,944లు రికవరీకి ఆదేశించారు. ప్రజావేదికకు హాజరైన డీఆర్‌డీఓ రఘువరన్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలు ఉపాది కొరకు వలసలు వెల్లకుండా ఉండేందుకు చేపట్టిన గొప్ప పథకం గ్రామీణ ఉపాధి హామీ పథకమని, ఎవరు అక్రమాలకు పాల్పడాలని చూసినా చట్టరీత్యా కేసులు, చర్యలు తప్పవన్నారు. క్షేత్రస్థాయి సిబ్బంది పని కోరిన ప్రతి ఒక్కరికీ పదిహేను రోజులలో పని కల్పించాలని, పని ప్రదేశాలలో నీడ, తాగు నీటి సౌక ర్యం కల్పించాలని సూచించారు. సమావేశంలో అడిష నల్ డీఆర్‌డీవో మదన్ మోహన్, అంబుడ్స్ పర్సన్ కృష్ణా రెడ్డి, క్వాలిటీ కంట్రోలర్ అధికారి దేవెందర్ రెడ్డి, ఎస్ఆర్‌పి బాలునాయక్, ఎంపీడీవో ఎ.శ్రీనివాస్ రెడ్డి, ఎంపీవో మహేందర్, ఏపీఓ అనీల్ కుమార్, పాల్గొన్నారు.



ఉపాదిహామీ ప్రజావేదికలో మాట్లాడుతున్న డీఆర్‌డీఓ రఘువరన్

మలేరియా నిర్మూలనకు కృషి చేయాలి



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బంది

జగిత్యాల అర్బన్ 25 (ఆంధ్రజ్యోతి): మలేరియా నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా వైద్యాధికారి ప్రమోద్ అన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా శుక్రవారం జగిత్యాల జిల్లా కేంద్రంలో వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ ఆరోగ్య సంస్థ పిలుపు మేరకు 2030 నాటికి మలేరియా నిర్మూలనకు సమాజంతో కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. జిల్లా ఉప వైద్యాధికారి బి. శ్రీనివాస్, డాక్టర్ హేమలత పాల్గొన్నారు.

పెగడపల్లి: ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం వైద్యాధికారి డాక్టర్ నరేష్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ నరేష్, వైద్యసిబ్బంది జయశీల, కల్పన, భాస్కర్, శ్రీలత, రమణ, శ్రీకాంత్‌రెడ్డి, రవికిరణ్ పాల్గొన్నారు.

వెంటాడిన విధి..

● 21 రోజుల వ్యవధిలో ఒకే కుటుంబంలో ముగ్గురు మృతి



ఎల్లవ్వ, నరేందర్, నర్సయ్య(ఫైల్)

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): కూలి పనులు చేస్తూ కాలం వెళ్లదీస్తున్న ఓ కుటుంబంపై విధి కన్నెర్ర జేసింది. అనారోగ్యం, ఆత్మహత్య రూపంలో 21రోజుల వ్యవధిలో ఒకే కుటుంబంలోని ముగ్గురిని కబళించింది. ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్ గ్రామంలో ఈనెల 3న గడ్డి నర్సయ్య(55) అనారోగ్యంతో చనిపోయాడు. కుటుంబ పెద్ద మరణం నుంచి తేరుకోక ముందే నర్సయ్య కొడుకు నరేందర్(24) మండల కేంద్రంలో ఓ మహిళ తనపై తప్పుడు కేసు నమోదు చేయించి జైలుకు వెళ్లడానికి కారణమైందని మనస్థాపంతో ఈనెల 22 ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తండ్రీకొడుకులు చనిపోయిన బాధ నుంచి కోలుకోక ముందే నర్సయ్య తల్లి గడ్డిఎల్లవ్వ(80) గురువారం రాత్రి అనారోగ్యంతో మృతిచెందింది. ఐదుగురు నివసిస్తున్న ఇంటిలో ముగ్గురు చనిపోవడంతో నర్సయ్య భార్య లక్ష్మీ, పెద్ద కొడుకు నవీన్‌లు మిగిలారు. 21రోజుల వ్యవధిలో ముగ్గురు మృతిచెందడం స్థానికంగా విషాదం నింపింది.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి

లక్సెట్టిపేట, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల జిల్లా లక్సెట్టిపేట పట్టణంలోని ఆంధ్రబోర్ సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతిచెందినట్లు ఎస్సై సురేష్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం అబ్బాపూర్‌కు చెందిన చెవుల రాజలింగయ్య(62) తన ద్విచక్రవాహనంపై ఊత్కూర్ చౌరస్తా నుంచి ఆంధ్రబోర్‌లోని తనకుమారుని వద్దకు వెళ్తుండగా వెనుకాల నుంచి ఓకారు ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అతడిని లక్సెటిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైనవైద్యంకోసం కరీంనగర్ తరలించగా అక్కడచికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడికి భార్య నలుగురుపిల్లలు ఉన్నారు. కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నాడు.

యువతి అనుమానాస్పద మృతి

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లోని జ్యోతినగర్‌లో ఓ యువతి అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. కరీంనగర్ టూటౌన్ పోలీసుల కథనం ప్రకారం... పెద్దపల్లి జిల్లా పాలితం గ్రామానికి చెందిన బాసిల్లి ఝాన్సీ(23) ఓప్రైవేట్ హాస్పిటల్‌లో నర్సుగా విధులు నిర్వర్తిస్తోంది. ఇద్దరు స్నేహితులతో కలిసి జ్యోతినగర్‌లో ఒక గదిలో ఉంటోంది. గురువారం రాత్రి భోజనం అనంతరం ఆమె గదిలోనే ఉండగా స్నేహితులు నిద్రించడానికి బిల్డింగ్‌పైకి వెళ్లారు. వారికి పరిచయం ఉన్న అజయ్ అనే వ్యక్తి వారికి ఫోన్ చేసి ఝాన్సీ ఫోన్ లిఫ్ట్ చేయడం లేదని చెప్పడంతో కిందికి వచ్చి చూశారు. అపస్మారక స్థితిలో ఉన్న ఆమెను ఆస్పత్రికి తరలించేలోపే మృతి చెందింది. ఝాన్సీ మృతిపై తమకు అనుమానాలున్నాయని మృతురాలి తండ్రి శంకర్ ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అలంకారప్రాయంగా..

● వినియోగంలోకి రాని నూతన అంగన్‌వాడీ భవనాలు ● ఆటలకు దూరమవుతున్న చిన్నారులు





నిరుపయోగంగా ఉన్న అంగన్‌వాడీ భవనాలు, చిన్నారులకు అందుబాటులోకి రాని క్రీడా పరికరాలు

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఆధునిక వసతులతో ప్రాథమిక విద్యను అందించాలనే లక్ష్యంతో ఒకే ప్రాంగణంలో అంగన్‌వాడీ, ప్రాథమిక, ఉన్నత పాఠశాల భవనాలను గత ప్రభుత్వం నిర్మించినా వినియోగంలోకి రాకుండా పోయాయి. ఫలితంగా చిన్నారులకు ఆటలు దూరమవుతున్నాయి. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రాథమిక పాఠశాలలు, ఉన్నత పాఠశాల భవనాలు ఒకే ప్రాంగణంలో ఉండేలా గత సర్కారు ఆధునిక వసతులతో నిర్మించింది. 'మన ఊరు- మన బడి' కార్యక్రమంలో భాగంగా ప్రారంభించి అందుబాటులోకి తీసుకువచ్చింది. ప్రాథమిక పాఠశాలలు, ఉన్నత పాఠశాలల విద్యార్థులకు విద్యను అందిస్తున్నా.. అంగన్‌వాడీ కేంద్రాలు మాత్రం స్థానిక పురాతన పాఠశాల గదుల్లోనే కొనసాగిస్తున్నాయి.

అంగన్‌వాడీ కేంద్రాల చిన్నారుల కోసం ప్రత్యేక వసతులు కల్పించిన ప్రయోజనం లేకుండాపోతోంది. అంగన్‌వాడీ కేంద్రం-2, 3లోని పిల్లలు అరకొర సౌకర్యాల నడుమ అవస్థలు పడుతున్నారు. విశాలమైన భవనాలు, ఆట వస్తువులు ఉన్న నూతన భవనాల్లోకి అంగన్‌వాడీ కేంద్రాలను తరలించడం లో సంబంధిత శాఖ అధికారులు అభ్యంతరమేమిటని చిన్నారుల తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి నూతన భవనాల్లోకి తరలించి ఆటపాటలతో కూడిన విద్య అందేలా చూడాలని కోరుతున్నారు.

నూతన భవనాల్లోకి కేంద్రాలను తరలించేలా చర్యలు..

లక్ష్మీరాజం, జిల్లా సంక్షేమ శాఖ అధికారి



ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాలను పాఠశాల ప్రాంగణంలో ఉన్న నూతన భవనాల్లోకి తరలించేలా చర్యలు చేపడుతున్నాం. చిన్నారులు, తల్లులకు ఆధునిక వసతులు, ఆటలు అందుబాటులోకి వచ్చేలా చూస్తాం. గతంలో పాఠశాల ప్రాంగణంలోకి కేంద్రాలను తరలిస్తే తల్లులు, గర్భిణులు భోజనం చేసేందుకు దూరమవుతుందనే కారణంతో పురాతన పాఠశాలలో కేంద్రాలను ఏర్పాటు చేశాం. అంగన్‌వాడీ టీచర్లు, తల్లులు, గర్భిణులు, స్థానికులతో చర్చించి కేంద్రాలను నూతన భవనాల్లోకి మార్చుతాం.

తూకంలో జాప్యం.. రైతుల పడిగాపులు



ప్రభుత్వ కేంద్రంలో కొనుగోలు చేస్తున్న ప్రైవేటు వ్యాపారి

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట గ్రామ శివారులో ఏర్పాటు చేసిన ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రంలో తూకంలో జాప్యం వల్ల రైతులు పడిగాపులు కాస్తున్నారు. తూకంలో ఆలస్యం.. మేఘాలు కమ్ముకుంటుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. చేసేదేమీ లేక రైతులు ప్రైవేటు వ్యాపారులకు విక్రయించేందుకు సిద్ధపడుతున్నారు. ఇదేఅదనుగా భావించి ప్రైవేటువ్యాపారులు కేంద్రాల్లో వాలుతున్నారు. క్వింటాలుకు రూ.1750 చొప్పున కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం ప్రైవేటుపరం అవుతున్నా సంబంధిత శాఖ అధికారులు స్పందించకపోవడం గమనార్హం. అధికారులు స్పందించి కొనుగోళ్లను వేగవంతం చేసి ప్రభుత్వ మద్దతు ధర దక్కేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఆర్ఎంపీ ఆత్మహత్య

మేడిపల్లి, ఏప్రిల్ 25: అనారోగ్యం కారణంగా ఓ ఆర్ఎంపీ ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం ప్రకారం.. మేడిపల్లికిచెందిన ఆర్ఎంపీ సంబారు జగదీష్ బాబు(44) మూడు సంవత్సరాల నుంచి తీవ్రమైన మెడనొప్పితో బాధపడుతున్నాడు. నాలుగునెలల క్రితం హైదరాబాదులోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో అపరేషన్ చేయించుకున్నాడు. కానీ మెడనొప్పి తగ్గలేదు అపరేషన్ కోసం రూ.5లక్షల వరకు ఖర్చు అయింది. అనారోగ్యంతో జీవితంపై విరక్తిచెంది శుక్రవారం మధ్యాహ్నం ఇంట్లో ఫ్యానుకు చీరతో ఉరి వేసుకొని ఆత్మహత్యాయత్నం చేశాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. డాక్టర్లు పరిశీలించి మృతిచెందాడని నిర్ధారించారు. మృతుడికి కొడుకు, కూతురు ఉన్నారు. మృతుడి భార్య రూపాశ్రీ ఫిర్యాదు మేరకు హెడ్‌కానిస్టేబుల్ మధుకర్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గొర్రెల దొంగతనానికి యత్నం

హుజూరాబాద్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పరిధిలోని దమ్మక్కపేటలో గురువారం రాత్రి గుర్తుతెలియని ఇద్దరువ్యక్తులు గొర్రెల దొంగతనానికి ప్రయత్నించారు. మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన గొర్రెల కాపరులు మేతకోసం దమ్మక్కపేటకు వచ్చి మందను ఏర్పాటు చేశారు. అర్ధరాత్రి గొర్రెలు అరవడంతో కాపరులు లేచి చూడగా ఇద్దరు వ్యక్తులు గొర్రెల వద్ద కనిపించారు. వారిలో ఒకరిని పట్టుకోగా, మరో వ్యక్తి పరారయ్యాడు. అతడిని హుజూరాబాద్ మండలం పెద్దపాపయ్యపల్లి గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. గొర్రెల కాపరి యజమాని బీరప్ప ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. నెల రోజులుగా 40 గొర్రెలను గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారని బీరప్ప వాపోయాడు.

అంగన్‌వాడీ టీచర్‌పై తేనెటీగల దాడి

హుజూరాబాద్‌రూరల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తుమ్మనపల్లి గ్రామంలో శుక్రవారం అంగన్‌వాడీ టీచర్‌పై తేనెటీగలు దాడిచేశాయి. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ముత్యాల సరోజన అనే అంగన్‌వాడీ టీచర్ రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న క్రమంలో చెట్టుపై ఉన్న తేనెటీగలు ఒక్కసారిగా వచ్చి దాడి చేశాయి. తీవ్రంగా గాయపడిన సరోజనను స్థానికులు హుజూరాబాద్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న కారు..

తంగళ్లపల్లి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండలం సారంపల్లి గ్రామంలో విద్యుత్‌స్తంభానికి కారు ఢీకొనడంతో ఒకరికి గాయాలయ్యాయి. సిద్దిపేట నుంచి సిరిసిల్ల వైపు వస్తున్న కారు సారంపల్లి గ్రామశివారులో మూల మలుపు వద్ద విద్యుత్ స్తంభాన్ని కారు ఢీకొంది. కారులో ప్రయాణిస్తున్న సాగర్ అనే వ్యక్తికి గాయాలయ్యాయి. కాగా, విద్యుత్ స్తంభం విరిగి కింద పడిపోవడంతో సరఫరా నిలిచిపోయింది. కారు యజమాని సెస్‌కు నష్టపరిహారం కింద రూ.10వేలు చెల్లించాడు. రెండు గంటల తరువాత విద్యుత్ సరఫరా పునరుద్ధరణ చేశారు.

చోరీ కేసులో ఇద్దరి అరెస్టు

● 250 గ్రాముల బంగారు ఆభరణాలు, భారీగా నగదు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ పట్టణంలో చోరీకి పాల్పడిన కేసుల్లో చిగురుమామిడి మండలం నవాబ్‌పేటకు చెందిన కంది సంపత్‌రెడ్డి, వరంగల్ జిల్లా నర్సంపేటకు చెందిన సూర రవిని అరెస్టు చేసినట్లు, వారి వద్ద 250 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.10 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్లు పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం తెలిపారు. శుక్రవారం కరీంనరగ్‌లో విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. నవాబ్ పేటకు చెందిన సంపత్‌రెడ్డి కరీంనగర్ బస్టాం డ్‌లో ఫిబ్రవరి 14న మహిళ బ్యాగ్ నుంచి 16.5 తులాల బంగారం, ఫిబ్రవరి 24న మరో మహిళా బ్యాగ్ నుంచి 47 గ్రాముల బంగారం, ఏప్రిల్ 8న ఓ వృద్ధుడి బ్యాగ్‌లో నుంచి 13 లక్షల నగదు చోరీచేశాడు. నిందితుడు శుక్ర వారం కమాన్‌చౌరస్తా వద్ద అనుమానా స్పదంగా కనిపించగా ఒకటో ఠాణా సీఐ కోటేశ్వర్ అదుపులోకి తీసుకొని విచారించారు. బస్టాండ్‌లో చోరీలకు పాల్పడు తున్నట్లు వెల్లడైంది. నర్సంపేటకు చెందిన సూర రవి ఏప్రిల్ 13న సప్తగిరి కాలనీలోని ఒక ఇంటిలో చొరబడి 175 గ్రాముల బంగారం, రూ.35వేల నగదును ఎత్తుకెళ్లాడు. పద్మనగర్ చౌరస్తాలో అనుమానాస్పదంగా తిరుగుతుండగా రెండో ఠాణా సీఐ సృజన్‌రెడ్డి అదుపులోకి తీసుకొని విచారించగా దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నాడు.

అతడివద్ద నుంచి 100గ్రాముల బంగారం స్వాధీనం చేసుకున్నారు. నిందితుల వద్ద స్వాధీనం చేసుకున్న బంగారం, నగదును సీజ్ చేసినట్లు, ఇద్దరిని కోర్టులో హాజరుపర్చను న్నట్లు సీపీ తెలిపారు. నిందితులను పట్టుకొని సొత్తును రికవరీ చేయడంలో కీలకంగా వ్యవహరించిన టౌన్ ఏసీపీ వెంకటస్వామితోపాటు సీఐలు బిల్ల కోటేశ్వర్, సృజన్‌రెడ్డి, ఎస్సైలు, సిబ్బందిని అభినందించారు.

ఎస్‌యూ స్టోర్‌రూంలో అగ్ని ప్రమాదం



స్టోర్ రూం సమీపంలో కాలిపోయిన చెట్లు



దగ్ధమవుతున్న పేపర్లు

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లోని శాతవాహన విశ్వవిద్యాలయం స్టోర్ రూంలో శుక్రవారం తెల్లవారుజామున అగ్నిప్రమాదం సంభవిం చింది. ప్రమాదంలో ఎస్‌యూకు చెందిన దిద్దిన పరీక్షపేపర్లు దగ్ధమ య్యాయి. 2022-23 సంవత్సరానికి సంబంధించిన ఆన్సర్ పేపర్లు ఈ మంటల్లో దగ్ధమైనట్లు జిల్లా ఫైర్ ఆఫీసర్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. అగ్నిప్రమాదంపై కొత్తపల్లి పోలీసులు విచారణ జరుపుతున్నట్లు తెలిసింది. గురువారం ఉదయం నుంచిరాత్రి వరకు ఫైర్ సిబ్బంది 4ఫైరింజన్‌లతో మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. వారు వెళ్లిన అనంతరం వేకువజామున మళ్లీ మంట లు చెలరేగడంతో అనుమానాలు వ్యక్తమ వుతున్నాయి.

బావిలో పడి వృద్ధుడి మృతి

వీణవంక, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన ఎండీ అంకుస్(78) ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలోపడి మృతిచెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. కొంత కాలంగా అంకుస్ మానసిస్థితి సరిగలేదు. శుక్రవారం ప్రమాదవశాత్తు ఇంటి ముందు ఉన్న వ్యవసాయ బావిలోపడి నీటిలో మునిగి మృతి చెందినట్టు తెలిపారు. మృతుడి కూమారుడు ఎండీ ఇబ్రహీం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తోట తిరుపతి తెలిపారు.

వేర్వేరు ప్రాంతాల్లో వడదెబ్బతో ఇద్దరి మృతి

జగిత్యాల అర్బన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా కేంద్రంలోని మంచినీళ్ల బావి సమీపంలో నివాసం ఉంటున్న గొల్లపెల్లి జగన్ గౌడ్(38) అనే యువకుడు వడదెబ్బతో మృతిచెందాడు. వారం రోజులుగా ఉష్ణోగ్రతలు పెరుగుతుండటంతో తట్టుకోలేక వడదెబ్బ తగిలి మృతిచెందాడు. మృతునికి భార్య జల, ఇద్దరు చిన్నారులు నిక్షిత, నిత్యశ్రీ ఉన్నారు. జగన్‌గౌడ్ మృతితో కుటుంబీకులు తీవ్రంగా విలపిస్తున్నారు.



వెంకన్న (ఫైల్)

జమ్మికుంట: జమ్మికుంట పట్టణంలోని హౌసింగ్‌బోర్డు కాలానికి చెందిన వొల్లాల వెంకన్న(55) వడదెబ్బతో శుక్రవారం మృతి చెందాడు. వెంకన్న జీప్ నడిపిస్తుంటాడు. గతంలో పక్షవాతం రావడంతో ప్రస్తుతం ఇంటి వద్దనే ఉంటున్నాడు. ఇటీవలే ఆరోగ్యం కుదుటపడింది. మధ్యాహ్నం భోజనం చేసి బయటకు కాలినడకన వెళ్లి తిరిగి ఇంటికి వచ్చి పడుకున్నాడు. కుటుంబ సభ్యులు గమనించి ఆసుపత్రికి తరలించేలోపు మృతిచెందాడు. ఎండల తీవ్రతతో వడదెబ్బ తగిలి మృతిచెందాడని కుటుంబ సభ్యులు తెలిపారు.

వివాహితను వేధించిన వ్యక్తిపై కేసు నమోదు

వీణవంక, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన పంజాల సమ్మయ్య తనను వేధిస్తున్నాడని అదే గ్రామానికి చెందిన ఓ మహిళ శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కథనం ప్రకారం.. వివాహిత పిల్లలతో ఒంటరిగా ఇంటిలో ఉండగా సమ్మయ్య ఇంటికి వెళ్లి తన కోరిక తీర్చాలని వేధింపులకు గురిచేశాడన్నారు. ఈ మేరకు సదరు మహిళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తోట తిరుపతి తెలిపారు.

ఆకాశంలో మబ్బులు.. అన్నదాతల్లో గుబులు

● కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం..



సద్దాలలో ధాన్యాన్ని కాపాడుకోవడానికి కవర్లు కప్పుతూ ఇబ్బందులు పడుతున్న రైతులు

కోనరావుపేట, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఆకాశంలో మబ్బులు కమ్ముకుంటుండ డంతో.. అన్నదాత్లో గుబులు రేగుతోంది.. కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం మూలుగుతుండ డంతో కుప్పలను కాపాడుకోవ డానికి రైతులు పాట్లు పడుతు న్నారు. కోనరావుపేట మండలం లో శుక్రవారం సాయంత్రం మబ్బులు కమ్ముకోవడంతో ధాన్యాన్ని కాపాడుకోవడానికి రైతులు ఇబ్బందులు పడ్డారు. మండలంలో మబ్బులు కమ్ము కొని ఈదురుగాలులు రావడంతో వర్షం నుంచి ధాన్యాన్ని కాపాడుకోవడానికి కొనుగోలు కేంద్రాల్లో రైతులు నానా ఇబ్బందిపడ్డారు. ధాన్యం కుప్పలపై కవర్లు కప్పి కాపాడుకునే ప్రయత్నంలో నిమగ్నమయ్యారు. కొనుగోలు కేంద్రాల్లో సరిపడా కవర్లు లేకపోవడంతో ప్రభుత్వం అన్ని వసతులు కల్పించాలని రైతులు కోరుతున్నారు.

అప్పుల బాధ భరించలేక యువకుడి ఆత్మహత్యాయత్నం

● చికిత్స పొందుతూ మృతి

మంథనిరూరల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుంజపడుగు గ్రామానికి చెందిన ఆకుల రాజేష్(32) అనే యువకుడు శుక్రవారం చికిత్స పొందుతూ మృతి చెందాడు. మంథని పోలీసుల కథ నం ప్రకారం.. గుంజపడుగు గ్రామానికి చెందిన రాజేష్ వ్యవసాయ కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అతని కుమారుడికి అరోగ్యం బాగాలేకపోవడంతో చికిత్స కోసం అప్పులుచేశాడు. అప్పులుతీర్చే దారిలేకపోవడంతో గురు వారం సాయంత్రం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమ నించిన కుటుంబసభ్యులు చికిత్సకోసం కరీంనగర్‌కు తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. భార్య అకుల లలిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బెదిరింపులకు పాల్పడిన దంపతులపై కేసు

చందుర్తి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): భూమి హద్దురాళ్ల తొల గింపు విషయంలో ఓ వ్యక్తిని చంపుతామని బెదిరించిన ఘటనలో దంపతులపై కేసు నమోదు చేసినట్లు చందుర్తి ఎస్సై అంజయ్య శుక్రవారం తెలిపారు. ఎస్సైకథనం ప్రకారం.. కొనరావుపేట మండ లం మామిడిపల్లి గ్రామానికి చెందిన కాటిపెల్లి రాజిరెడ్డికి చందుర్తి మండలం ఎనగల్ గ్రామశివారులోని సర్వే నంబర్ 427లో 10 గుంటల భూమి ఉంది. కొంత భూమి చందుర్తి మండలం ఎన్గల్ గ్రామానికిచెందిన గుండెకర్ల తిరుపతికి సంబం ధించిన భూమిలో అదనంగా ఉన్నట్లు సర్వేయర్ గుర్తించారు. సర్వేయర్ నిర్ణయించిన భూమికి హద్దురాళ్లను ఏర్పాటు చేశారు. తిరుపతి హద్దురాలను తొలగించడంతో ఇద్దరి మధ్య గొడవ తలెత్తింది. హద్దురాళ్లను తొల గించి చంపేస్తామని బెదిరింపులకు పాల్పడిన ఎన్గల్ గ్రామానికి చెందిన గుండెకర్ల తిరుపతి-విజయ దంపతులపై రాజిరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా ఉంచాలి

● గంగాధర పోలీస్ స్టేషన్‌ను ఆకస్మిక తనిఖీచేసిన సీపీ గౌస్ ఆలం



కేసుల రికార్డులను పరిశీలిస్తున్న సీపీ గౌస్ ఆలం

గంగాధర, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): రౌడీషీటర్లు, హిస్టరీషీటర్లపై ప్రత్యేకనిఘా ఉంచి వారికదలికలను గమనిస్తుండాలని సీపీ గౌస్‌ఆలం అన్నారు. శుక్రవారం గంగాధర పోలీస్‌స్టేషన్‌ను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. పోలీస్‌స్టేషన్‌లో పెండింగ్‌లో ఉన్న కేసులపై సమీక్షనిర్వహించారు. కేసులు పెండింగ్‌కుగల కారణాలను అడిగి తెలుసుకుని వాటిని త్వరగా పూర్తిచేయాలన్నారు. విజిబుల్ పోలీసింగ్‌పై ప్రత్యేక దృష్టిసారించాలని, సిబ్బంది తమ పరిధిలోని గ్రామాలను క్రమం తప్పకుండా సందర్శించి ప్రజలతో మమేకం కావాలని ఆదేశించారు.ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలోని గ్రామానికి ఒక ప్రత్యేక పోలీస్‌సిబ్బందిని కేటాయించాలని ఆదేశించారు. గంజాయి రవాణా, ఇసుక అక్రమ రవాణా, పీడీఎస్‌బియ్యం రవాణా, పేకాట వంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపాలన్నారు. ఈసందర్భంగా స్టేషన్ సిబ్బందితో ఆయన ముచ్చటించారు. కార్యక్రమంలో ఎస్‌హెచ్‌వో ఎస్ఐ వంశీకృష్ణ, ఇతర సిబ్బంది అధికారులు పాల్గొన్నారు.

రేఖది హత్యే: సీఐ శ్రీనివాస్‌గౌడ్

గంభీరావుపేట, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : గంభీరావుపేట మండలం గజసింగవరంలో చెరుకూరి రేఖది అనుమానాస్పద మరణం కాదని, హత్యేనని ఎల్లారెడ్డిపేట సీఐ శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. అత్యాచారయత్నంలో శ్రీకాంత్ రేఖను హత్య చేశాడని సీఐ వెల్లడించారు. గజసింగవరం ఘటనపై సీఐ శ్రీనివాస్‌ను వివరణఅడగా, రేఖది హత్యేనని తెలిపారు. రేఖను హత్య చేసిన అనంతరం భయంతో శ్రీకాంత్ కూడా ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. తన భార్యను శ్రీకాంత్ అనే వ్యక్తి హత్య చేశాడంటూ మృతురాలి భర్త మహేష్ ఇచ్చిన ఫిర్యాదు చేశాడని సీఐ వెల్లడించారు.

మత విభజనలు దేశానికి ప్రమాదకరం

సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎస్‌వీరయ్య

భగత్‌నగర్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): మత విభజనలు దేశానికి ప్రమాదకరమని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎస్‌వీరయ్య అన్నారు. శుక్రవారం నగరంలోని ముకుందలాల్ మిశ్రా భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఉగ్రవాదాన్ని ఐక్యంగా అంతమొందించాలన్నారు.పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడి అత్యంత అమానుష, హేయమైన చర్య అని, దేశ ప్రజలు ఒక్కటిగా ఎదుర్కొని టెర్రరిజాన్ని తుద ముట్టించాలన్నారు. ఘటనపై లోతైన దర్యాప్తు జరపాలన్నారు.

కాశ్మీర్‌లో ఉగ్రవాదం అంతమైందని ప్రధాని, హోంమంత్రి ప్రకటించారన్నారు. పెద్ద నోట్ల రద్దు సందర్భంగా కూడా నకిలీ నోట్లు టెర్రరిస్టులకు అందుబాటులో లేకుండా చేయాలనే నోట్లు రద్దు చేస్తున్నట్లు ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రకటనలకు ఆచరణలకు పూర్తి విరుద్ధంగా కాశ్మీర్‌లో పరిస్థితులు ఉన్నాయన్నారు. దేశంలోని 143 భారత పౌరులను ఐక్యంగా నిలబెట్టాల్సిన తరుణంలో మతపరమైన సమస్యగా చిత్రీకరించే ప్రయత్నం జరగుతోందన్నారు. ఉగ్రవాదుల నుండి తుపాకి లాక్కునే ప్రయత్నంలో హార్స్ రైడర్‌ను కాల్చి చంపారని, ఆ యువకుడు ఒక ముస్లిం అని మర్చి పోకూడదని అన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రంలో వసతులు కల్పించాలన్నారు. అకాల వర్షాలతో దెబ్బతిన్న పంటలకు పరిహారం చెల్లించాలని, బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. 500 బోనస్ చెల్లించాలన్నారు.

కిషన్ రెడ్డి బొగ్గు శాఖ మంత్రి ఉండగానే సింగరేణి బొగ్గు బ్లాకులను వేలం వేశారన్నారు. సింగరేణి విషయంలో బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీకి తేడా లేదన్నారు. సింగరేణిని కాపాడుకునే సోయి ఈ మూడు పార్టీలకు లేదన్నారు. సమస్యల పరిష్కారం కోసం పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు గీట్ల ముకుందరెడ్డి, గుడికందుల సత్యం, బీమా సాహెబ్, యు శ్రీనివాస్, డినరేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్‌వీరయ్య, పాల్గొన్న సీపీఎం నాయకులు



తునికాకు సేకరణపై సన్నగిల్లుతున్న ఆసక్తి

- కూలీలకు ప్రత్యామ్నాయ ఆదాయ మార్గాలు
- ఆకు, కూలీలు లేక టెండర్లకు ముందుకు రాని కాంట్రాక్టర్లు
- జిల్లాలో అమ్ముడుపోని తునికాకు యూనిట్లు
- 7 యూనిట్లకు 3 యూనిట్లలోనే టెండర్లు పూర్తి
- 28 కల్లాల్లో ఆకుల సేకరణ బంద్, జిల్లా లక్ష్యం 7600 ఎస్‌బీలు
- మే తొలి వారంలో ఆకు సేకరణ, గతేడాది 50 ఆకుల కట్టకు రూ. 3

మంథని, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): అటవీ ప్రాంతాల్లోని గ్రామీణ కూలీలకు వేసవిలో ప్రధాన ఆదాయ వనరుగా ఉన్న తునికాకు సేకరణపై ఆసక్తి సన్నగిల్లుతోంది. పదేళ్ళ క్రితం వరకు యేటా తునికాకు సీజన్‌లో వచ్చే ఆదాయంతో కుటుం బంలో ముఖ్యమైన కార్యక్రమాలను గట్టెక్కించునే వారు. రాను రాను గ్రామీణులు ఆకు సేకరణకు ముందుకు రావడం లేదు. యేటా అడవులు, గుట్టలు అంతరించిపోవడం, ఆకు లభ్యం కాకపోవడం, ప్రత్యామ్నాయ ఆదాయ వనరులు స్థానికంగా అందుబాటులోకి రావడంతో పల్లె జనం తునికాకు సేకరణపై పెద్దగా ఆసక్తి చూపడం లేదు. ఈ కారణాలకు తోడు నాణ్యమైన తునికాకు లభ్యం కాకపోవడంతో యూనిట్ల కోసం టెండర్లు వేసే కాంట్రాక్టర్లు సైతం ముందుకు రావడం లేదు. గతంలో తునికా కు యూనిట్ల కోసం కాంట్రాక్టర్లు పోటీ పడి టెండర్లు దక్కించు కునే వారు. ప్రస్తుతం పరిస్థితి క్రమంగా తగ్గుతూ వస్తుంది.

మంథని, పెద్దపల్లి ఫారెస్టు రేంజి పరిధిలో మంథని-1, ఖమ్మంపల్లి, ముత్తారం-ఎ, ముత్తారం-బీ, రామగుండం, పెద్దపల్లి, కల్వచర్ల యూనిట్లు ఉండగా వాటిలో తునికాకు సేకరణ కోసం ప్రభుత్వం ద్వారా ఆటవీ శాఖ టెండర్లు ఆహ్వానించగా ముత్తారం-బీ, ఖమ్మంపల్లి, కల్వచర్ల కేవలం మూడు యూనిట్లనే కాంట్రాక్టర్లు తీసుకున్నారు. మిగితా 4 యూనిట్లలో ఆకు సేకరణకు కాంట్రాక్టర్లు టెండర్లు తీసుకులేదు.

జిల్లాలోని 7 యూనిట్లలో 47 ఆకుల కళ్ళాలు, 7600 స్టాండర్ బ్యాగ్‌ల టార్గెట్ ఉండగా వాటిలో ఈ సంవత్సరం 3 యూనిట్లలో మాత్రమే టెండర్ ప్రక్రియ ముగియడంతో వాటి పరిధిలోని 18 కల్లాల్లో ఆకు సేకరణ జరగనుంది. మిగితా 29 కళ్ళాలల్లో ఈఏడు ఆకు సేకరణ జరగడం లేదు. ముత్తారం యూనిట్ పరిధిలోని దర్యాపూర్, హరిపురం, కేశనపల్లి, మచ్చుపేట, మైదంబండ, పారుపల్లి గ్రామాల్లో 900 స్టాండర్ బ్యాగుల లక్ష్యంగా ఆకుల కళ్ళాలు ఏర్పాటు చేయనున్నారు. ఖమ్మంపల్లి యూనిట్ పరిధిలోని చిన్నఓదాల, ధర్మారం, గోపాల్‌పూర్, జిల్లల్లపల్లి-ఏ, జిల్లల్లపల్లి-బీ, ఖమ్మంపల్లి-ఏ, ఖమ్మంపల్లి-బీ, సీతంపల్లి గ్రామాల్లో 1700 స్టాండర్ బ్యాగుల లక్ష్యం. కల్వచర్ల యూనిట్ పరిధిలోని గౌరెడ్డిపల్లి, రత్నాపూర్, సబితం, వెన్నంపల్లి గ్రామాల్లో 200 స్టాండర్ బ్యాగుల లక్ష్యంగా కళ్ళాలు ఏర్పాటు చేయనున్నారు. 50 ఆకుల కట్టకు రూ. 3 గత ఏడాది కాంట్రాక్టర్లు కూలీలకు చెల్లించారు. ఈఏడాది ఇంకా కట్ట రేట్ నిర్ణయించలేదు. వెయ్యి ఆకు కట్టలు ఒక స్టాండర్ బ్యాగ్‌గా లెక్కిస్తారు. మే తొలి వారంలో టెండర్లు పూర్తయిన ముత్తారం-బీ, ఖమ్మంపల్లి, కల్వచర్ల యూనిట్ల పరిధిలోని 18 కళ్లాల్లో తునికాకు సేకరణ ప్రారంభమయ్యే అవకాశం ఉంది. యూనిట్ల పరిధిలోని ఆయా అటవీ గ్రామాల్లో వారం లేదా 10 రోజుల పాటు తునికాకు సీజన్ సందడి కొనసాగనుంది.

కాలిబూడిదైన ఈతవనం

మూడు వేలకుపైగా చెట్లు దగ్ధం


బండలింగాపూర్ శివారులో కాలిపోయిన ఈత చెట్లు

మెట్‌పల్లి రూరల్, ఏప్రిల్, 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బండలింగాపూర్ గ్రామ శివారులోని శుక్రవారం ఈతవనం దగ్ధమైంది. గ్రామ శివారులో గీత కార్మికులు మూడు ఎకరాలలో ఈత చెట్లను పెంచుతున్నారు. గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టి ఉండవచ్చునని స్థానికులు పేర్కొంటున్నారు. అగ్నిప్రమాదం తెలిసిన వెంటనే గీత కార్మికులు అగ్ని మాపక సిబ్బందికి సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న అగ్ని మాపక సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చారు. గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో ఈతచెట్లు కాలి బూడిదయ్యాయని గౌడ కులస్తులు పేర్కొన్నారు. ఈత వనం దగ్ధం కావడంతో ఉపాధి కరువవుతుందని గీత కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యం

సుల్తానాబాద్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని సాంబయ్యపల్లి శివారులోని గర్రెపల్లి చెరువులో గుర్తుతెలియని మహిళ(45) మృతదేహం శుక్రవారం లభ్యమైంది. ఎస్ఐ శ్రావణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గుర్తు తెలియని మహిళ మృతదేహం కుళ్లినస్థితిలో ఉంది. జీన్స్ ప్యాంట్, మూడు షర్టులు వేసుకొని ఉంది. ఆమె ప్యాంట్ జేబులో మధ్యప్రదేశ్‌కు చెందిన లేఖన్‌సింగ్ పేరుతో ఉన్న పాన్‌కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు చెందిన డెబిట్‌కార్డు లభ్యమైంది. ఎవరికైనా ఆచూకీ తెలిస్తే స్థానిక పోలీస్‌స్టేషన్ లేదా ఎస్ఐ సెల్ నంబర్ 8712656511కు సమాచారం అందించాలని ఎస్ఐ శ్రావణ్‌కుమార్ సూచించారు.

ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిపై ఫిర్యాదు

హుజూరాబాద్‌రూరల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఎల్కతుర్తిలో బీఆర్ఎస్ నిర్వహించే సభకు ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి మండలంలోని సింగాపూర్, చిన్న పాపయ్యపల్లి, కందుగుల గ్రామాల్లోని చెట్లకు పార్టీ రంగులువేసి పర్యావరణానికి హాని కలిగించారని దీనిపై చర్యలు తీసుకోవాలని శుక్రవారం యువజన కాంగ్రెస్ నాయకులు ఎంపీడీవో కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. పార్టీ కార్యక్ర మానికి చెట్లను వాడుకోవడం ఏమిటని ప్రశ్నించారు. చెట్లకు వేసిన పార్టీ వేసి రంగులపై తెలుపురంగు వేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో శ్రీకాంత్, ఉమ్మడి సందీప్, పంజాల అరవింద్, సుమన్ తదితరులు ఉన్నారు.

సీజేరియన్లు తగ్గించి..

సహజ ప్రసవాలను ప్రోత్సహించాలి

జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వెంకటరమణ

హుజూరాబాద్‌రూరల్/జమ్మికుంట రూరల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): సీజేరియన్లు తగ్గించి.. సహజ ప్రసవాలను ప్రోత్సహించాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వెంకటరమణ అన్నారు. శుక్రవారం ఆయన హుజూరాబాద్ మండలంలోని చెల్పూర్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని, , జమ్మికుంట జమ్మికుంట మండలంలోని వావిలాల ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అవుట్‌రీచ్ కేంద్రాల్లో ఆరోగ్య మహిళా హెల్త్ క్యాంపులు నిర్వహించి మహిళలందరికీ స్క్రీనింగ్ పూర్తి చేయాలన్నారు. ఆసుపత్రిలో వైద్యసిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. రికార్డుల నిర్వహణ పకడ్బందీగా ఉండాలన్నారు. ఆయన వెంట పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ మధు, జిల్లా హెల్త్ ఎడ్యూకేటర్ పంజాల ప్రతాప్, జమ్మికుంటలో పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రాజేష్, డిస్ట్రిక్ట్ హెల్త్ ఎడ్యూకేటర్ పంజాల ప్రతాప్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఇల్లందకుంట: ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి వెంకటరమణ అన్నారు. శుక్రవారం ఇల్లందకుంట పీహెచ్‌సీలో ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో ప్రపంచ మలేరియా దినోత్సవ అవగాహన ర్యాలీలు నిర్వహిస్తున్నామన్నారు. ఇంటి పరిసర ప్రాంతాల్లో కూలర్లు, డ్రమ్ములు, పాతటైర్లు, తదితర వాటిలో నీటి నిల్వలు లేకుండా చూడాలన్నారు. అనంతరం ఫార్మసీ స్టోర్‌లో వేసవి కాలానికి సంబంధించి మందుల నిల్వలను, లేబరేటరీ, ఎన్సీడీ క్లీనిక్‌లను సందర్శించారు. ఆస్పత్రికి వచ్చిన రోగులను వారికి అందుతున్న సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ తులసీదాస్, డాక్టర్ కల్యాణ్, జిల్లా హెల్త్ ఎడ్యుకేటర్ పంజాల ప్రతాప్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.




హుజూరాబాద్‌లో వైద్య సేవల గురించి రోగులను అడిగి తెలుసుకుంటున్న జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వెంకటరమణ, ఇల్లందకుంటలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

శాతవాహనలో ఎంఫార్మసీ పరీక్ష వాయిదా

గణేశ్‌నగర్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయంలో ఈ నె 28 నిర్వహించనున్న ఎంఫార్మసీ మొదటి సెమిస్టర్ పరీక్ష వాయిదా వేసినట్లు విశ్వ విద్యాలయ పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ సురేష్ కుమార్ తెలిపారు. అదే రోజున ఆర్ఆర్‌బీ పరీక్ష ఉందని, ఎం ఫార్మసీ పరీక్షను 29కి వాయిదా వేసినట్టు పేర్కొన్నారు.

చట్టబద్ధంగా దత్తత తీసుకోవాలి


దత్తత తీసుకున్న దంపతులకు ఉత్తర్వులు అందజేస్తున్న కలెక్టర్

కరీంనగర్ అర్బన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): పిల్లలు లేని దంపతులు చట్టబద్ధమైన దత్తత తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ పరిధిలోని కరీంనగర్ శిశు గృహంలో పెరుగుతున్న ఆరునెలల శిశువును పూణేకు చెందిన దంపతులు రెండు నెలల క్రితం దత్తత ఇచ్చారు. ఆ దంపతుకు దత్తత ఉత్తర్వులను కలెక్టర్ పమేలా సత్పతి శుక్రవారం ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దత్తత తీసుకోవాలన్నుకవారు జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయంలో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, డీసీపీవో పర్వీన్, పీవో తిరుపతి, శిశు గృహ మేనేజర్ తేజస్వి, సోషల్ వర్కర్ రాజేష్ పాల్గొన్నారు.

మోకాళ్లపై నిలబడి నిరసన



ఎస్‌యూలో నిరసన తెలుపుతున్న కాంట్రాక్ట్, పార్ట్ టైం అసిస్టెంట్ ప్రొఫెసర్లు

గణేశ్‌నగర్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయంలోని కాంట్రాక్ట్, పార్ట్ టైం అసిస్టెంట్ ప్రొఫెసర్లు మోకాళ్లపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. యూనివర్సిటీ వద్ద చేపట్టిన సమ్మె నాలుగో రోజుకు చేరింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశ్వ విద్యాలయాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, పార్ట్ టైం ప్రొఫెసర్లను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. ఇక్కడ పనిచేస్తున్న వారందరూ కొన్ని దశాబ్దాలుగా యూనివర్సిటీ విద్యా వ్యవస్థను తమ బోధనతో కాపాడుకుంటూ వచ్చిన వాళ్లేనని, వారి సేవలను గుర్తించాలని కోరారు.

హక్కుల సాధనకు ఐఎన్‌టీయూసీ కృషి

ఐఎన్‌టీయూసీ జాతీయ కార్యదర్శి బాబర్ సలీంపాషా

జ్యోతినగర్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): కార్మికుల హక్కుల సాధనకు ఐఎన్‌టీయూసీ రాజీలేని పోరాటం చేస్తున్నదని యూనియన్ జాతీయ సీనియర్ కార్యదర్శి, ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు బాబర్ సలీంపాషా తెలిపారు. శుక్రవారం ఎన్టీపీసీ పీటీ ఎస్‌లోని యూనియన్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో బాబర్ మాట్లాడారు.



మాట్లాడుతున్న బాబర్ సలీంపాషా

దేశంలోనే అతిపెద్ద కార్మిక సంఘంగా గుర్తింపు పొందిన ఐఎన్‌టీయూసీ సంఘ టిత, అసంఘటిత రంగ కార్మికుల ప్రయోజనాల పరిరక్షణకు కృషి చేస్తున్నదన్నారు. పెద్దపల్లి జిల్లాలో ఐఎన్‌టీయూసీని మరింత బలోపేతం చేసేందుకు కొత్త కమిటీని ఎన్నుకున్నామని తెలిపారు. నూతన కార్యవర్గం జిల్లాలో అన్నివర్గాల కార్మికుల డిమాండ్ల సాధనకు కృషి చేస్తుందన్నారు. ప్రధానంగా ఎన్టీపీసీ, సింగరేణి, ఆర్ఎఫ్‌సీఎల్‌తోపాటు అసంఘటిత రంగంలోని ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్లు, బీడీ కార్మికులు తదితర కార్మికుల కోసం పనిచేస్తుందన్నారు. మే 20న జరిగే దేశవ్యాప్త సమ్మెకు జిల్లా ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో అన్ని యూనియన్లతో సమన్వయం చేసుకొని సమ్మె విజయవంతానికి కృషి చేస్తామని బాబర్ తెలిపారు. సమావేశంలో ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు బూమళ్ల చందర్, ప్రధాన కార్యదర్శి విజయ్ మోహన్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఐఎన్‌టీయూసీ పెద్దపల్లి జిల్లా కమిటీ..

ఐఎన్‌టీయూసీ పెద్దపల్లి జిల్లా కార్యవర్గాన్ని యూనియన్ జాతీయ కార్యదర్శి బాబర్ సలీంపాషా సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బూమళ్ల చందర్, ప్రధాన కార్యదర్శిగా విజయ్ మోహన్, ఉపాధ్యక్షులుగా నీరటి శంకర్, మేకల సతీష్, డిప్యూటీ జనరల్ సెక్రెటరీలుగా కుల్ల వెంకటేశ్వర్లు, కనకయ్య, జునుతుల సమ్మిరెడ్డి, కొమరయ్య, కోశాధికారిగా సురేందర్, జాయింట్ సెక్రెటరీలుగా నయీం పాషా, బొద్దున శీనివాస్, ఎండీ జమీల్, కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.

బడి భద్రత ఎలా?

- పాఠశాలలకు ప్రారంభమైన వేసవి సెలవులు
- ప్రభుత్వ పాఠశాలల్లో విలువైన సామగ్రి

హుజూరాబాద్ రూరల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వపాఠశాలలకు రాత్రి పూట కాపాలాదారుల లేక రక్షణ కరువైంది. వేసవిసెలవులు ప్రారంభమయ్యాయి. దీంతో విలువైన కంప్యూటర్లు, గ్రీన్‌చాక్ బోర్డులు, టీవీలు, బెంచీలు, ల్యాబ్ పరికరాలు ఇతర సామగ్రి భద్రత అధికారులకు ప్రశ్నార్థకంగా మారింది. కొన్నిచోట్ల ఉన్నత పాఠశాలలు గ్రామాలకు దూరంగా ఉన్నాయి. ఇలాంటి చోట్ల చోరీలు జరగడానికి ఎక్కువగా అవకాశం ఉంది. ఏ పాఠశాల లోనూ సీసీ కెమెరాలు లేవు. కిటికీలు, తలుపులు కూడా సరిగ్గా లేకపోవడం సమస్యగా మారింది. పలు చోట్ల ప్రభుత్వ పాఠ శాలల్లో అసాంఘిక కార్యకలా పాలు చోటు చేసుకుంటున్నాయి. విద్యా ర్థులు టెక్నికల్‌స్కిల్స్ పెంపొందించడానికి కొన్ని సంస్థలు ప్రాథమిక పాఠశాలలకు కంప్యూటర్లు, విలువైన తరగతి సామగ్రిని అందజేశారు. వాటి భద్రత ప్రస్తుతం అందోళనకరంగా మారింది.


చెల్పూర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

కాపాలాదారులను నియమించాలి..

వేసవి సెలవులు ముగిసే వరకు తాత్కలిక పద్ధతిలోనైనా ఉన్నతపాఠశాలలకు కాపలాదారులను నియమించాలి. అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలకు కూడా కొంత బాధ్యత అప్పగిస్తే మేలు. కంప్యూటర్లు ఉంచిన గదులకు తలుపులు, కిటికీలు పటిష్ఠంగా ఉండేలా చూసుకోవాలి. పాఠశాల ఆవరణల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలి.

అందరూ కలిసి కాపాడుకోవాలి..
భూపతి శ్రీనివాస్, ఎంఈవో, హుజూరాబాద్



ఉన్నతపాఠశాల్లో కంప్యూటర్లు ఉన్నాయి. భద్రత ఉన్న గదుల్లోనే కంప్యూటర్లు ఉన్నాయి. గ్రామాల్లో విద్యార్థులు, వారి తల్లి దండ్రులు వేసవి సెలవుల్లో పాఠ శాలలపై ఓ కన్నేసి ఉంచాలి. పాఠశాలల ఆస్తులను అందరూ కలిసి కాపాడుకోవాలి.

అవినీతికి పాల్పడ్డ వారిపై చర్యలకు ప్రభుత్వం ఆదేశం

కరీంనగర్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కరీంనగర్ ఉమ్మడి జిల్లా ఉన్న సమయంలో.. 11 ఏళ్ల క్రితం జరిగిన ఓ అవినీతి వ్యవహారంలో బాధ్యులైన అధికారుల నుంచి డబ్బులు రికవరీ చేయాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. 11 ఏళ్ల క్రితం ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని 16 ఐసీడీఎస్ ప్రాజెక్టుల్లో భారీగా అవినీతి జరిగింది. దీనిపై విచారణ జరిపిన ప్రభుత్వం బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. పదవీ విరమణ పొందిన అధికారులు మోహన్‌రెడ్డి నుంచి 45 లక్షలు, రాములు నుంచి 11 లక్షలు, రాధమ్మ, సుభద్ర, విజయలక్ష్మి పెన్షన్ నుంచి రెండు శాతం రికవరీ చేయాలని ఆదేశాలు జారీ చేసింది. సీనియర్ అసిస్టెంట్ జయకృష్ణ నుంచి 24 లక్షలు రికవరీ చేసి అతడిని రివర్షన్ చేసింది. ఏడీ సరస్వతి, సీనియర్ అసిస్టెంట్లు శ్రీనివాసరావు, ధర్మయ్యను మళ్లీ తప్పులు చేయవద్దని ప్రభుత్వం హెచ్చరించింది. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి టేకుమల్ల సమయ్య మాట్లాడుతూ ఐడీసీఎస్‌లో అవినీతికి పాల్పడ్డ అధికారులు, సిబ్బందిపై చర్యలు తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

చికిత్స పొందుతూ చిన్నారి మృతి


సైనీశ్రీ (ఫైల్)

మానకొండూర్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చెంజర్ల గ్రామానికి చెందిన గొల్లెన కోమలత-సంతోష్ దంపతుల కుమార్తె సైనీశ్రీ(8) శుక్రవారం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది. వివరాల్లోకి వెళితే.. సంతోష్ కరీంనగర్-వరంగల్ ప్రధానరహదారి పక్కన నూతన ఇంటిని నిర్మించాడు. దాని పక్కన సిమెంట్ ఇటుకలతో వాటర్ ట్యాంకును నిర్మించారు. బంధువుల ఇంటిలో ఫంక్షన్ ఉండగా తన చిన్న కుమార్తె వెళ్లగా గురువారం పెద్ద కుమార్తె సైనీశ్రీని తల్లిదండ్రులు కొత్తగా నిర్మించిన వాటర్ ట్యాంకులో నీటిని నింపేందుకు తీసుకెళ్లారు. ట్యాంకు పక్కన సైనీశ్రీ ఆడుకుంటున్న సమయంలో ట్యాంకు కూలిపోయి చిన్నారి మీద పడి తీవ్రగాయాల పాలైంది. చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ అదే రాత్రి మృతి చెందింది. మృతురాలు రెండో తరగతి చదువుతోంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సంజీవ్ తెలిపారు.

అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు

(5వ పేజీ తరువాయి)

రెండు గదులు, ప్రత్యేకంగా వంట గది, టాయిలెట్‌తో ఇంటిని నిర్మించుకోవాల్సి ఉంది.

ఇవీ అర్హతలు :

ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారుల ఎంపికకు ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. ఆర్‌సీసీ ఇల్లు ఉన్న వారికి ఇవ్వరు. రెండున్నర ఎకరాల కంటే ఎక్కువ సాగు భూమి, లేదా 5 ఎకరాల నీటిపారుదల లేని భూమి ఉండొద్దు. నాలుగు చక్రాల వాహనం, వ్యవసాయ అనుబంధ 3 బై 4 చక్రాల వాహనం ఉండొద్దు. రూ.50 వేల కంటే ఎక్కువ కిసాన్ క్రెడిట్‌కార్డు పరపతి ఉండవద్దు. ఇన్‌కంట్యాక్స్ చెల్లించే వారు అనర్హులు. తల్లిదండ్రులు, జీవిత భాగస్వామి, పిల్లల్లో ఎవరైనా ప్రభుత్వ ఉద్యోగి అయి ఉండకూడదు. ఇప్పటికే ఇళ్ల నిర్మాణం ప్రారంభించి ఉండకూడదు. ప్రస్తుతం ఉన్న ఇంటికి అనుబంధంగా మరో నిర్మాణం లేదా ఉమ్మడిగా ఇంటి నిర్మాణం చేసే వారికి పథకం వర్తించదు.

పకడ్బందీగా ఇందిరమ్మ ఇంటి సర్వే

- సత్యప్రసాద్, జిల్లా కలెక్టర్, జగిత్యాల

జిల్లా వ్యాప్తంగా పలు గ్రామాల్లో ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారుల సర్వే పకడ్బందీగా నిర్వహిస్తున్నాం. జిల్లాలో వచ్చిన దరఖాస్తుల పరిశీ లన ఆధారంగా గెజిటెడ్ అధికారులచే లబ్ధిదారుల ఎంపిక కొరకు సర్వే నిర్వహిస్తున్నాం. ఇందుకు మండల స్థాయిలో ప్రత్యేకాధి కారుల ను నియామకం చేశాం. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారుల ఎంపిక సర్వే జరుగుతుంది.

ఆసుపత్రిలో మౌలిక వసతుల కల్పనకు కృషి

కోరుట్ల, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : కోరుట్ల పట్టణంలోని 100 పడకల ఆసుపత్రిలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ అన్నారు. శుక్రవారం ఆసుపత్రిలో రాజ్యసభ సభ్యుడు సురేష్ రెడ్డి మంజూరు చేసిన రూ. 2 లక్షల విలువతో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను వైద్యులతో కలిసి ప్రారంభించారు. ఆసుపత్రి సూపరిండెంట్ సునితా రాణి, వైద్యులు వినోద్, ప్రదీప్, శిల్పా, రమేష్‌లతో పాటు బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

నిష్పక్షపాతంగా ఇందిరమ్మ లబ్ధిదారుల ఎంపిక

మెట్‌పల్లిటౌన్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక నిష్పక్షపాతంగా జరుగుతుందని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు జెట్టి లింగం అన్నారు. శుక్రవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శి తుమ్మనపల్లి రాంప్రసాద్, జిల్లా సేవాదళ్ అధ్యక్షులు నాయిని శ్రీనివాస్‌గౌడ్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు పుల్లూరి వెంకటేష్, నాయకులు ప్రసాద్, నరేష్ పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రం వద్ద చలివేంద్రం ఏర్పాటు

కథలాపూర్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దుంపెటలో వేములవాడ - కోరుట్ల రహదారిపై దుంపెటకు చెందిన సీఆర్పీ ఊడుగుల రాజేందర్ శుక్రవారం చలివేంద్రం ఏర్పాటు చేశాడు. బాటసారులతో పాటు కొనుగోలు కేంద్రం వద్దకు వచ్చే రైతుల దాహం తీర్చడానికి తన తండ్రి లక్ష్మణ్ జ్ఞాపకార్థం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

నర్సరీని పరిశీలించిన కమిషనర్

మెట్‌పల్లిటౌన్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): వన మహోత్సవంలో భాగంగా మున్సిపల్ కమిషనర్ టి. మోహన్ శుక్రవారం రేగుంట శివారులోని నర్సరీని పరిశీలించారు. ఆయన వెంట డీఈ నాగేశ్వరరావు, రత్నాకర్, విష్ణు, ముజిబ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు భూ భారతి అవగాహన సదస్సు

మల్లాపూర్, ఏప్రిల్, 25 (ఆంధ్రజ్యోతి) : మల్లాపూర్ మండల కేంద్రంలోని రైతు వేదికలో శనివారం భూ భారతి అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ వీర్‌సింగ్ శుక్రవారం తెలిపారు.

బీఆర్‌ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయండి

కొడిమ్యాల, ఏప్రిల్25(ఆంధ్రజ్యోతి) : ఈ నెల 27న వరంగల్‌లో నిర్విహించే బీఆర్‌ఎస్ రజతోత్సవ సభను వియవంతం చేయాలని చొప్పదండి నియోజకవర్గ బీఆర్‌ఎస్ యూత్ వైస్ ప్రెజిడెంట్ పెండాల ప్రణీకుమార్ ప్రజలను కోరారు.

అలరించిన విద్యార్థుల నృత్యాలు



నృత్యం చేస్తున్న విద్యార్థులు

భీమారం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): భీమారం మండల కేంద్రంలోని సిద్ధార్థ హైస్కూల్ 21వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన నృత్యాలు పలువురిని అలరించాయి. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పల్లికొండ గణేష్ భీమారం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సింగిరెడ్డి నరేష్ రెడ్డి, మాజీ సర్పంచ్ ఉత్కం శంకర్ గౌడ్, డీపీవో ఆఫీస్ అసిస్టెంట్ అల్లె రాజేందర్, మాజీ ఎంపీటీసీ పల్లి అర్జున్, సామాజిక కార్యకర్త గుగ్గిల్ల రవి గౌడ్, వేణు రావు తదితరులు పాల్గొన్నారు.

కాంటాక్ట్ అధ్యాపకుల వంటావార్పు

కొడిమ్యాల: మండలంలోని నాచుపల్లి జేఎన్‌టీయూ కళాశాల ఎదుట కాంటాక్ట్ అధ్యాపకులు శుక్రవారం తమను రెగ్యులరైజేషన్ చేయాలని కోరుతూ చేస్తున్న నిరవధిక సమ్మెలో భాగంగా శుక్రవారం వంటవార్పు చేసి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కాంటాక్ట్ అధ్యాపకులు హరీష్‌కుమార్, జయంత్, ఉదయ్,కె. శ్రీనివాస్, శశికాంత్, రాజు, రాకేష్, కుమారస్వామి, లత, గౌతమి తదితరులు పాల్గొన్నారు.

వరిధాన్యం కొనుగోలు కేంద్రాల పరిశీలన

కొడిమ్యాల, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి) : మండలంలోని డబ్బుతిమ్మయ్యపల్లి, నల్లగొండ గ్రామాల్లో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం తహసీల్దార్ జి. రమేష్ పరిశీలించారు. తహసీల్దార్ వెంట ఆర్‌ఐ. కరుణాకర్ తదితరులు ఉన్నారు.

ఉత్సాహంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

పెగడపల్లి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): పెగడపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఆత్మీయ సమ్మేళనం ఉత్సాహంగా సాగింది. 2013-14 బ్యాచ్‌కు చెందిన పదవ తరగతి విద్యార్థులు శుక్రవారం తాము చదువుకున్న తమకు విద్యా బుద్ధులు నేర్పించిన గురువులతో కలసి పాఠశాలలో సమా వేశమయ్యారు. గురువులను ఘనంగా సత్కరించారు.

అమూల్యను అభినందించిన విప్



అమూల్యను అభినందిస్తున్న విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్

వెల్గటూర్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ఇంటర్‌లో ప్రతిభ చూపిన వెల్గటూర్ మండలం శాలపల్లి గ్రామానికి చెందిన ఐట్ల అమూల్యను ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అభినందించారు. అమూల్య ఆర్థిక పరిస్థితి బాగా లేకపోవడంతో కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు కళాశాలలో అడ్లూరి సొంత ఖర్చులతో చదివించారు. అమూల్య ఇంటర్ బైపీసీ ప్రథమ సంవత్సరంలో 440 మార్కులకు 434 మార్కులు సాధించింది. అమూల్య, వారి కుటుంబ సభ్యులు శుక్రవారం ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌ను ధర్మపురిలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

పహల్గాం దాడిపై నిరసనల వెల్లువ



జగిత్యాలలో వ్యాపారుల ర్యాలీ



జగిత్యాలలో వాకర్స్ అసోసియేషన్ నివాళి



రాయికల్‌లో ముస్లిం సెంట్రల్ కమిటీ నాయకులు



మెట్‌పల్లిలో బైక్ ర్యాలీ

జగిత్యాల అర్బన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): పహల్గాంలో ఉగ్రదాడికి నిరసనగా జగిత్యాలలో పలు హిందూ సంస్థలు, వ్యాపారులు చేపట్టిన బంద్ విజయవంతమైంది. ఈ సందర్భంగా టవర్ సర్కిల్ నుంచి కొత్త బస్టాండ్ వరకు వ్యాపారులు నిరసన ప్రదర్శన చేపట్టారు. ఎస్‌కెఎన్‌ఆర్ డిగ్రీ కళాశాల, మున్సిపల్ పార్క్, రామాలయం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 5 వందల మంది బైక్ ర్యాలీ నిర్వహించారు. శుక్రవారం రాత్రి రామాలయం వద్ద కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహండారు. ఆయా కార్యక్రమాలో బిజెపి రాష్ట్ర నాయకులు ముదుగంటి రవీందర్‌రెడ్డి, విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షులు బోయిని పద్మాకర్, జిట్టవేణి అరుణ్ కుమార్, గాజోజు సంతోష్, సీపెల్లి రవి భారత్ సరక్ష సమితి రాష్ట్ర అధ్యక్షులు ఏసిఎస్ రాజు, రాయిల్ల సత్తన్న ,ఆర్టీఏ సభ్యులు చాంబర్ ఆఫ్ కామర్స్ చైర్మన్ కమటాల శ్రీనివాస్, బిసి సంఘం రాష్ట్ర కార్యదర్శి మునిపట్లలక్ష్మీనారాయణ, డిండిగాల విఠల్ పాల్గొన్నారు.

రాయికల్: పట్టణంలో పలు హిందూ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించతలపెట్టిన బంద్ శుక్రవారం ప్రశాంతంగా జరిగింది. ఈ సందర్భంగా పలు వాణిజ్య, వ్యాపార సముదాయాలు, హోటళ్లు స్వచ్ఛందంగా బంద్ పాటించాయి. అలాగే సెంట్రల్ ముస్లీం కమిటీ ఆధ్వర్యంలో అంగడి బజార్‌లో ఉగ్రవా దుల దాడిని ఖండిస్తూ నివాళులు అర్పించారు. కిష్టం పేట, కొత్తపేట గ్రామాల్లో నివాళులర్పించారు.

మెట్‌పల్లిటౌన్: మెట్‌పల్లిలో బంద్ ప్రశాంతంగా కొనసాగింది. పట్టణంలో రోడ్లు నిర్మానుష్యంగా దర్శనమిచ్చాయి. విశ్వహిందు పరిషత్ నాయకులు బైక్ ర్యాలీ నిర్వహించారు.

కొడిమ్యాల: ఉగ్రదాడిని నిరసిస్తూ మండలంలో బంద్ పాటించారు. ఈ కార్యక్రమంలో అఖిల పక్షం నాయకులు, హిందూ బంధువులు, ఐక్యవేదిక నాయకులు, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

కోరుట్ల: పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిలో మృతి చెందిన అమరులకు శుక్రవారం ఐఎంఏ, కేఎంజీఎస్ వైద్య సంఘ సభ్యులు ఘన నివాళిని అర్పించారు. కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఐఎంఏ, కేఎంజీఎస్ వైద్యులు అనూఫ్ రావు - స్వీతి అనూఫ్, రేకొండ రాజేష్, కటకం జగదీశ్వర్, అన్వేష్, రవికిరణ్, మనోజ్ రమేష్, ఇంద్రానీల్, నరేష్, సంపత్, లక్ష్మిపతి, రాజేందర్, అనూరాధ, జ్యోత్న, ప్రియాంకలతో పాటు పలువురు పాల్గొన్నారు.

మల్యాల: జమ్ముకాశ్మీర్‌లోని పహల్గాంలో పర్యటకులపై ఉగ్రవాదుల దాడిని నిరసిస్తూ మల్యాలలో హిందూ ఐక్య వేధిక ఆధ్వర్యంలో నిర్వహించిన బంద్ విజయవంతం అయింది. వ్యాపార, వాణిజ్య సంస్థలు స్వచ్చందగా బంద్‌లో పాల్గొన్నాయి. యాగండ్ల లక్ష్మీనారాయణగౌడ్, బట్టు పవన్, నరేష్, శంకర్, శేఖర్, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

ధర్మపురి: జమ్ము కాశ్మీర్‌లో ఉగ్రవాదుల జరిపిన దాడులకు నిరసనగా హిందూ ఐక్య వేదిక ఆధ్వర్యంలో ధర్మపురి పట్టణంలో నిర్వహించిన బంద్ శుక్రవారం విజయవంతమైంది. ధర్మపురి సీఐ రాంనర్సింహారెడ్డి ఆధ్వర్యంలో ఎస్‌ఐ ఉదయ్‌కుమార్, పోలీస్ సిబ్బంది భారీ బందో బస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హిందూ ఐక్య వేదిక నాయకులు, బీజేపీ పట్టణ అధ్యక్షులు గాజు భాస్కర్, కస్తూరి రాజన్న, బెజ్జారపు లవణ్, నలుమాసు వైకుంఠం, తిరుమన్‌దాసు సత్యనారాయణ, దివిటి శ్రీధర్, కలకోట రాజు, అల్లం దుర్గప్రసాద్, ఆనందాసు నవీన్, మండలోజు సూరజ్ తదితరులు పాల్గొన్నారు.

గొల్లపెల్లి: పహెల్గాంలో ఉగ్రదాడికి నిరసనగా గొల్లపెల్లి మండల కేంద్రంలో శక్రవారం రాత్రి కొవ్వొత్తులతో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నల్ల శ్యాం, కొక్కుల భూమయ్య, కోల శ్రీనివాస్, బుర్ర నారాయణ, బత్తిని సత్యనారాయణ, కోలా వెంకటేశ్, కట్కూరు రాజు, వనయ్ తదతరులు పాల్గొన్నారు.



కొడిమ్యాలలో అఖిల పక్షం నాయకులు



కోరుట్లలో నివాళులర్పిస్తున్న వైద్యులు



మల్యాలలో మూసి ఉన్న దుకాణాలు



ధర్మపురిలో మూసిఉన్న దుకాణాలు

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

ధర్మపురి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే సద్వినియోగం చేసుకోవాలని జిల్లా లీడ్ బ్యాంక్ ఎఫ్ఎల్సీ కోట మదుసూధన్ అన్నారు. ధర్మపురి మండలంలోని జైనా గ్రామంలో ఆర్థిక అక్షరాస్యత అవగాహన సదస్సు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ జన సురక్షా బీమా పథకాలైన ప్రధాన మంత్రి జీవన జ్యోతి బీమా యోజన, సుకన్య సమృద్ధి యోజన, అటల్ పెన్షన్ యోజన పథకాల గురించి వివరించారు. ఏదైనా బ్యాంక్ లేదా పోస్టాఫీస్‌లో ఖాతా కలిగి ఉండి 18 నుంచి 70 సంవత్సరాల వయస్సు కలిగి ఉన్న వారందరూ ఈ పథకాలకు అర్హులని ఆయన తెలిపారు.ధర్మపురి ఎస్‌బీఐ మేనేజర్ నరేష్ మాట్లాడుతూ బ్యాంక్ సేవలను అందిపుచ్చుకుని ఆర్థికంగా స్వయం సమృద్ధి సాధించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి సురేష్, పెర్ప్ సీసీ గంగాధర్, వీవోఏలు లావణ్య, సునీత, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

'జగిత్యాల జిల్లా సమగ్ర స్వరూపం' పుస్తకం ప్రశంసనీయం



పుస్తకావిష్కరణలో ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్

జగిత్యాల, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా సమగ్ర స్వరూపాన్ని పుస్తక రూపకంలో తీసుకొని రావడం ప్రశంసనీయమని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ మాకునూరి సంజయ్ కుమార్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఎమ్మెల్యే సంజయ్ కుమార్ చేతుల మీదుగా పుస్తకావిష్కరణ జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ సారస్వత పరిషత్తు కృషి అభినందనీయమన్నారు. జిల్లాకు సంబంధించిన భాషా, సాహిత్యం, అనేక అంశాలపై వివిధ వ్యాస కర్తలు రచించిన 'జగిత్యాల జిల్లా సమగ్ర స్వరూపం' పుస్తకం ఆవిష్కరించడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి రాము, తెలంగాణ సారస్వత పరిషత్తు ప్రధాన కార్యదర్శి డాక్టర్ జుర్రు చెన్న య్య, మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కల్వకుంట్ల రామకృష్ణ, తెలుగు విభాగాధిపతి డాక్టర్ ప్రమోద్ కుమార్, అధ్యాపకురాలు డాక్టర్ శ్రీలత, డాక్టర్ వాసాల వర ప్రసాద్, డాక్టర్ వాసవి, నీరజ, మల్లికార్జున, జమున, సంగీత రాణి, డాక్టర్ చిందం సునీత, పుస్తక కోర్ కమిటీ సభ్యులు కూకట్ల తిరుపతి, బూర్ల చంద్రశేఖర్, తిరునగరి శరత్ చంద్ర, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి పాల్గొన్నారు.

ఆస్తుల సంరక్షణకే వక్ఫ్ బిల్లు

మల్యాల, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): ధార్మిక, సేవా కార్యక్రమాలకు దానం చేసిన ఆస్తులను అన్యాక్రాంతం కాకుండా, వాటిని సంరక్షించేందుకే కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ సవరణ బిల్లును తీసుకువచ్చిందని ఇందులో ఎలాంటి అపోహలకు తావు లేదని బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు సింగిరెడ్డి కృష్ణారెడ్డి అన్నారు. మల్యాలలో శుక్రవారం వక్ఫ్ సవరణ చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు బింగి వేణు, గాజుల మల్లేశం, పొన్నం సాయికుమార్‌గౌడ్, సురేశ్, మల్లేశం యాదవ్, రాజశేఖర్, గుండేటి గంగారాం, రుత్త కిషన్ పాల్గొన్నారు.

సన్మానం

మెట్‌పల్లిటౌన్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి) : పట్టణానికి చెందిన షేక్ సాజిద్ కూతురు రుష్ద ఆసిఫా ఇటీవల వెలువడిన ఇంటర్ ఫలితాలలో బైపీసీ సెకండియర్‌లో 983 మార్కులు సాధించిన సందర్భంగా విద్యార్థినిని మెట్‌పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ కూన గోవర్ధన్ అభినందించి ఘనంగా సన్మానించారు.

మల్లాపూర్: మండలంలోని కొత్తదాంరాజుపల్లి గ్రామంలోని కేరళ హైస్కూల్ పూర్వ విద్యార్థులకు ప్రిన్సిపాల్ అనిల్‌సింగ్ శుక్రవారం సన్మానించారు. గ్రామంలోని కేరళ హైస్కూల్ పూర్వ విద్యార్థులు కాటిపల్లి సాహిత్యరెడ్డి, మామిడాల రవళి ఇంటర్ ఫలితాల్లో ప్రతిభ చూపడంతో ప్రిన్సిపాల్ శాలువాలతో ఘనంగా సన్మానించారు.

విద్యారంగం బలోపేతానికి కృషి

పెగడపల్లి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : విద్యా వ్యవస్థ బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పేర్కొన్నారు. పెగడపల్లి మండలంలోని నామాపూర్ గ్రామంలోని జడ్పీ ఉన్నత పాఠశాల , ప్రాథమిక పాఠశాలల వార్షికోత్సవ వేడుకలు గురువారం రాత్రి ఘనంగా జరిగాయి. వార్షికోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొని మాట్లాడారు. పాఠశాలల్లో సమస్య ఉంటే తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు నృత్యాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి.

భారత రాజ్యాంగాన్ని పరిరక్షించాలి

● ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్



పాదయాత్రలో విప్ లక్ష్మణ్‌కుమార్, నాయకులు



వేంపేటలో కాంగ్రెస్ నాయకుల పాదయాత్ర

ధర్మపురి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగాన్ని పరిరక్షించాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పేర్కొన్నారు. జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా ధర్మపురి మండలంలోని దమ్మన్నపేట నుంచి రాజారం వరకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్రలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజారం గ్రామంలో ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ మాట్లాడుతూ గత కొన్ని రోజులు క్రితం పార్లమెంట్‌లో కేంద్ర మంత్రిగా వ్యవహరిస్తున్న అమిత్‌షా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పైన చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు, ధర్మపురి మండల కాంగ్రెస్ అధ్యక్షులు సంగనభట్ల దినేష్, మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షులు వేముల రాజేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు కుంట సుధాకర్, జిల్లా ఎస్సీ సెల్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు చిలుముల లక్ష్మణ్, పట్టణ కాంగ్రెస్ చీపిరిశెట్టి రాజేష్, మండల యువజన కాంగ్రెస్ అప్పం తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

మెట్‌పల్లి రూరల్: రాజ్యాంగ స్ఫూర్తితో ప్రజల సంక్షేమ ఎజెండాగా ప్రజా ప్రభుత్వ పాలన సాగిస్తుందని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అల్లూరి మహేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని వేంపేట, చింతలపేట గ్రామంలో జై బాపు, జై భీమ్, జసంవిధాన్ నినాదంతో అంబేద్కర్ రచించిన రాజ్యాంగ పరిరక్షణ యాత్రను స్థానిక నాయకులతో కలిసి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పల్లి శేఖర్‌గౌడ్, గోరుమంతుల ప్రవీణ్‌కుమార్, కొమ్ముల రాజేశ్వరరెడ్డి, రాజారెడ్డి, మహిపాల్ యాదవ్, అల్లూరి సురేందర్‌రెడ్డి, గోపిడి ముత్యం, ఎర్ర మారుతి, గంగాధర్, తుమ్మల లింగారెడ్డి, మాదరి భూమయ్య, పెంటపర్తి శ్రీను, మారంపల్లి రమేష్, అల్లూరి సుకుమార్‌రెడ్డి, ఏలేటి తిరుపతి, పందిరి శ్రీనివాస్, కొమ్ముల మహేందర్, చుక్కబొట్ల సుమాన్ పాల్గొన్నారు.

తురుకకాశీనగర్‌లో ఆర్డీవో స్థల పరిశీలన

కొడిమ్యాల, ఏప్రిల్25(ఆంధ్రజ్యోతి): మండలంలోని తురుకకాశీనగర్ గ్రామంలో శుక్రవారం జగిత్యాల ఆర్డీవో పులి మదుసూదన్‌గౌడ్ స్థల పరిశీలన చేశారు. గ్రాస్తులు నివసించుతున్న భూముల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎన్ని సంవత్సరాల నుంచి ఇక్కడ నివసిస్తున్నారని గ్రామస్థులను అడిగి తెలుసుకున్నారు. దీంతో పలువురు గ్రామస్థులు 30 నుంచి 40 సంవత్సరాలుగా తామంతా ఇక్కడే నివసిస్తు న్నట్లు ఆర్డీవోకు విన్నవించుకున్నారు.తహసీల్దార్ రమేష్, ఆర్‌ఐ. కరుణాకర్ ఉన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

వెల్గటూర్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ కొనుగోళ్ల వేగవంతం చేయాలని పీడీ డీఆర్డీఏ రఘువరణ్ ఆదేశించారు. శుక్రవారం వెల్గటూర్ మండలంలోని పైడిపల్లి ఐకెపి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ధాన్యం కొనుగోళ్లను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కొనుగోలు చేసిన ధాన్యాన్ని ట్యాబ్ ఎంట్రీ త్వరగా చేయాలని నిర్వాహకులకు సూచించారు. రైతులు కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తెచ్చినపుడే సంబంధిత ధ్రువీకరణ పత్రాలు అందించాలన్నారు.

పహల్గాం మృతుల ఆత్మశాంతికి మసీదులో ప్రార్థనలు



మేడిపల్లిలో నల్ల రిబ్బన్‌లతో నిరసన తెలుపుతున్న ముస్లింలు

కథలాపూర్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): కశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రదా డిలో మృతి చెందిన యాత్రికుల ఆత్మశాంతికి శుక్రవారం కథలాపూర్ మండల కేంద్రంలోని మసీద్‌లో ముస్లింలు ప్రార్థనలు నిర్వహించారు. మాజీ కోఆప్షన్ సభ్యుడు ఎండీ రఫీ, చాంద్, మోయిన్, ఇసాక్, షఫీ, మౌళానా, అష్రఫ్ ఉన్నారు.

మేడిపల్లి: జమ్ము కాశ్మీర్ పహల్గాంలో ఉగ్రదాడికి నిరసనగా మేడిపల్లిలో ముస్లింలు శుక్రవారం నమాజ్ అనంతరం నల్ల రిబ్బెన్‌లు ధరించి నినాదాలు చేశారు. కార్యక్రమంలో ముస్లిం కమిటీ సభ్యులు మహ్మద్ అఖీల్, అన్‌సర్ అలి, మదర్‌వలి, అబ్దుల్ రహ్మాన్, సాజిద్, జావిద్, మసూద్, దస్తగిరి, చాంద్, రసూల్, ఉబెదుల్లా, మస్తాన్, అద్దు పాల్గొన్నారు.

ధర్మపురి : జమ్ము కశ్మీర్‌లో పర్యాటకులపై ఉగ్రవాదులు జరిపిన దాడులకు నిరసనగా ధర్మపురి పట్టణంలో ముస్లిం కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం నల్లబ్యాడ్జీలు ధరించి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ముస్లీం కమిటీ పట్టణ నాయకులు ఎండీ జహంగీర్, ఇక్రం, రఫియొద్దీన్, యూనస్, ఇసాక్, ఇస్మాయిల్, అంజద్, చాంద్, ఇబ్రహీం, ఆరిప్ పాల్గొన్నారు.

విద్యార్థినికి సన్మానం



విద్యార్థినికి సన్మానం

కొడిమ్యాల, ఏప్రిల్25(ఆంధ్రజ్యోతి): ఇంటర్ బైపీసీలో 1000 మార్కులకు 995 మార్కులు సాధించిన మండలంలోని హిమ్మతురావుపేటకు చెందిన ఆకునూరి మీనాక్షిని శుక్రవారం సర్పంచుల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు పునుగోటి కృష్ణారావు శాలువా కప్పి సన్మానించారు.

వాటర్ ప్యూరిఫయర్ వితరణ

పెగడపల్లి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : పెగడపల్లి మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలకు శుక్రవారం పాఠశాల పూర్వ విద్యార్థి స్వర్గం అనీల్ రూ. 30 వేలు విలువ చేసే వాటర్ ప్యూరిఫయర్‌ను అందజేశారు. పూర్వ విద్యార్థుల సమ్మేనంలో పాల్గొన్న అనీల్ ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు లచ్చయ్యకు అందజేశారు.

సేంద్రియ ఎరువుతో అధిక దిగుబడి



తాండ్ర్యాలలో సేంద్రీయ ఎరువు తయారీని పరిశీలిస్తున్న ఏఓ

కథలాపూర్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : రైతాంగం సేంద్రీయ ఎరువులను వినియోగించుకుని అధిక దిగుబడులు సాధించవచ్చని ఏఓ యోగిత పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని తాండ్ర్యాలలో పాలెపు గంగాధర్ అనే రైతు క్షేత్రంలో ట్రైకోడర్మా విరిడి శిలీంద్రపు ఎరువును ప్రయోగాత్మకంగా తయారు చేసే విధానాన్ని పరిశీలించారు. 90 కిలోల పశువుల ఎరువుకు 10 కిలోల వేప పిండికి 2 కిలోల ట్రైకోడర్మా విరిడితో 2 కిలోల బెల్లం కలపి కుళ్లించడానికి సంచుల్లో ఉంచాలని సూచించారు. 10 నుంచి 20 రోజులు కుళ్ళించి ఎరువును తయారు చేసుకోవచ్చని చెప్పారు. దుక్కిలో కలియ దున్ని ఈ ఎరువు చల్లుకుంటే మంచి ఫలితం కనిపిస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా ఏఈఓ సుష్మశ్రీ, వంగ తిరుపతి, తీగల రఘు, రాచమడుగు గంగారావు, సంజీవ్ తదితరులు ఉన్నారు.